రేపటి నుంచి పార్లమెంట్

నేడు అఖిలపక్ష భేటీ • 23న కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, జూలై 20: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 12 వరకు జరుగనున్న ఈ సమావేశాల్లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న 2024-25 ఆర్థిక సంవత్సర పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతారు. ముందు రోజు సోమవారం నాడు ఆమె ఆర్థిక సర్వేను పార్లమెంట్ ముందుకు తీసుకొస్తారు. 90 ఏండ్ల నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయాన్ విధేయక్-2024 బిల్లుతో సహా మొత్తం ఆరు బిల్లులను ప్రవేశపెట్టాలనే యోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తున్నది. పార్లమెంట్ సమావేశాల్లో నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలపై ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం జరుగనున్నది.

వందేమాతరం, జై హింద్ నినాదాలు చేయొద్దు!

పార్లమెంట్ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో 'హ్యాండ్‌బుక్ ఆఫ్ మెంబర్స్ ఆఫ్ రాజ్యసభ'లోని పలు సారాంశాలను ప్రస్తావిస్తూ రాజ్యసభ సెక్రటేరియట్ తాజాగా ఒక బులెటిన్ విడుదల చేసింది. సభాపతి రూలింగ్స్‌ను సభలో కానీ, సభ బయట కానీ ఎంపీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా విమర్శించకూడదని పేర్కొన్నది. అదేవిధంగా వందే మాతరం, జై హింద్ సహా ఏ ఇతర నినాదాలు చేయకూడదని గుర్తుచేసింది. సభలో ప్లకార్డులు ప్రదర్శించకూడదని స్పష్టం చేసింది.

యూపీఎస్సీ చైర్మన్ సోనీ రాజీనామా!

- పూజా ఖేడ్కర్ వ్యవహారం నేపథ్యంలో ప్రాధాన్యం
- వ్యక్తిగత కారణాలతోనేనని అధికారిక వర్గాల వెల్లడి
- 15 రోజుల క్రితమే రిజైన్.. పొందని ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 20: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) చైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేసినట్టు సమాచారం. వ్యక్తిగత కారణాలతోనే ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి. యూపీఎస్సీ చైర్మన్‌గా గత ఏడాది మేలో బాధ్యతలు చేపట్టిన మనోజ్ సోనీ.. పదవీ కాలం 2029 మే వరకు ఉండగానే రాజీనామా చేయడం గమనార్హం. ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ వ్యవహారం తర్వాత యూపీఎస్సీని వివాదాలు, పలు ఆరోపణలు చుట్టుముట్టిన నేపథ్యంలో మనోజ్ సోనీ రాజీనామా అంశం ప్రాధాన్యం సంతరించుకొన్నది. అయితే తన రాజీనామాకు ఖేడ్కర్ వివాదానికి ఎలాంటి సంబంధం లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆయన రాజీనామా ఇంకా ఆమోదం పొందలేదని తెలిపాయి.

తీవ్ర వివాదమైన పూజా ఖేడ్కర్ వ్యవహారం

ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర వివాదం రేపింది. నకిలీ పత్రాలు, పేర్ల మార్పుతో మోసం చేసి ఆమె పరిమితికి మించి సివిల్స్ పరీక్ష రాసినట్టు తేలడంతో ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు యూపీఎస్సీ శుక్రవారం వెల్లడించింది.

రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తున్న బీజేపీ

యూపీఎస్సీ చైర్మన్ రాజీనామాపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందించింది. యూపీఎస్సీని పలు కుంభకోణాలు కుదిపేశాయని, ఇది జాతీయస్థాయి ఆందోళకర అంశమని తెలిపింది. దేశంలోని రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠ, సమగ్రత, స్వతంత్రతను దెబ్బతీయడం ద్వారా ఆయా సంస్థలను బీజేపీ-ఆరెస్సెస్ తన చేతుల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

కర్ణాటకలో సినిమా టికెట్లపై సెస్!

- ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లపైనా..
- ప్రజలపై మరో బాదుడుకు సిద్ధమైన కాంగ్రెస్ సర్కారు
- ఇటీవలే పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున వడ్డింపు
- పాల ధరలూ భారీగా పెంపు
- ఆర్టీసీ చార్జీలు 20 శాతం పెంచేందుకు ప్రతిపాదనలు

బెంగళూరు, జూలై 20: కర్ణాటక ప్రజలపై కాంగ్రెస్ సర్కారు మరో గుదిబండ వేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పాలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు సినిమా టికెట్లపైనా భారం మోపాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో టికెట్లపై సెస్ విధించాలని నిర్ణయం తీసుకుంది. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లపై కూడా సెస్ వసూలు చేయనుంది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కర్ణాటక సినీ అండ్ కల్చరల్ యాక్టివిస్ట్స్(వెల్ఫేర్) బిల్ - 2024లో ఈ సెస్ గురించి పొందుపరిచింది. అన్ని సినిమా టికెట్లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లపై 2 శాతం వరకు సెస్ విధించనున్నట్టు తెలుస్తున్నది. ప్రతి మూడేండ్లకు ఒకసారి ఈ సెస్‌ను సమీక్షించి అవసరమైతే మార్పులు చేయనుంది. సెస్ ద్వారా వసూలైన నిధులను సినీరంగంలో పని చేస్తున్న ఆర్టిస్టులు, సిబ్బంది సంక్షేమం కోసం వినియోగిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకోసం సినిమాటోగ్రఫీ మంత్రి నేతృత్వంలో ఓ బోర్డును ఏర్పాటు చేస్తామని అంటున్నది. అయితే, ప్రతిపక్ష బీజేపీ మాత్రం.. కాంగ్రెస్ కుంభకోణాలు, తెలివి తక్కువగా ప్రవేశపెట్టిన గ్యారెంటీలతో ఖాళీ అయిన ఖజానాను నింపుకునేందుకే ఈ సెస్ విధిస్తున్నదని ఆరోపిస్తున్నది.

పాలు.. పెట్రోల్.. ఇప్పుడు సినిమా టికెట్లు

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ఐదు గ్యారెంటీల పేరిట కర్ణాటక కాంగ్రెస్ ప్రజలకు హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే లోక్‌సభ ఎన్నికలు ముంచుకురావడంతో ఈ గ్యారెంటీలను వేగంగా అమలు చేసింది. దీంతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని బీజేపీ, జేడీఎస్ ఆరోపిస్తున్నాయి. అందుకే, వరుసగా అన్ని ధరలను పెంచుతున్నదని పేర్కొంటున్నాయి. ఈ నెల ఆరంభంలో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పాల ధరపై లీటరుకు రూ.2 పెంచింది. ఈ ఏడాదిలో పాల ధరను పెంచడం ఇది రెండోసారి. గత నెల పెట్రోల్, డీజిల్ ధరలపై సేల్స్ ట్యాక్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచింది. దీంతో లీటరు పెట్రోల్‌పై రూ.3, లీటరు డీజిల్‌పై రూ.3.02 ధర పెరిగింది. ఇక, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల కేఎస్ఆర్టీసీకి రూ.295 కోట్ల నష్టం వచ్చిందని, కాబట్టి బస్సు చార్జీలను 15 - 20 శాతం పెంచాలని ప్రభుత్వానికి కేఎస్ఆర్టీసీ ప్రతిపాదనలు పెట్టింది. ఇలా లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి కర్ణాటక ప్రజలపై ప్రభుత్వం వరుసగా ధరల భారాన్ని మోపుతున్నది.

సేంద్రియ వ్యవసాయ నిపుణులు

కమలా పూజారి కన్నుమూత

భువనేశ్వర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సేంద్రీయ రైతు కమలా పూజారి శనివారం ఒడిశాలో కన్నుమూశారు. 74 ఏండ్ల పూజారి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కమలా పూజారి మృతికి ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరపనున్నట్టు చెప్పారు. వ్యవసాయ రంగానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొనియాడారు.

85 లక్షల డివైజ్‌లపై ప్రభావం

- ఐటీ అంతరాయంపై మైక్రోసాఫ్ట్
- సాఫీగా విమానయాన సేవలు

వాషింగ్టన్, జూలై 20: మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యపై ఆ సంస్థ కీలక ప్రకటన చేసింది. సైబర్ సెక్యూరిటీ సంస్థ అయిన క్రౌడ్‌స్ట్రైక్ చేసిన ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని, దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల విండోస్ డివైజ్‌లపై పడినట్టు ప్రస్తుతం అంచనా వేస్తున్నట్టు శనివారం తన బ్లాగ్‌లో వెల్లడించింది. మొత్తం విండోస్ డివైజ్‌లలో ఇది ఒక శాతం కంటే తక్కువేనని పేర్కొన్నది. మైక్రోసాఫ్ట్ అజూర్‌లో సమస్యను పరిష్కరించేందుకు క్రౌడ్‌స్ట్రైక్ సాయం చేసినట్టు వెల్లడించింది. ఇందుకోసం అమెజాన్ వెబ్ సర్వీసెస్, గూగుల్ క్లౌడ్‌తో కూడా కలిసి పని చేసినట్టు తెలిపింది.

యథావిధిగా విమానయాన సేవలు

మైక్రోసాఫ్ట్‌లో ఎర్రర్‌తో శుక్రవారం తీవ్ర అంతరాయాలు ఎదుర్కొన్న విమానయాన సేవలు కుదుటపడ్డాయి. శనివారం తెల్లవారు జామున 3 గంటల నుంచి దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఎయిర్‌లైన్స్ వ్యవస్థలన్నీ సాధారణంగా పని చేస్తున్నాయని, విమాన కార్యకలాపాలన్నీ సాఫీగా సాగుతున్నాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ప్రయాణ సర్దుబాట్లు, టికెట్ చార్జీల రీఫండ్‌లు సరిగ్గా జరిగేలా విమానయాన శాఖ పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. కాగా, శనివారం కూడా శంషాబాద్ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన 18 విమానాలు రద్దయినట్టు అధికారులు తెలిపారు.

వంద శాతం చార్జీలు వాపస్

న్యూఢిల్లీ నుంచి శాన్ ఫ్రాన్సిస్కోకు సాంకేతిక సమస్య వల్ల 30 గంటలు ఆలస్యంగా వెళ్లిన ఏఐ-183 విమాన ప్రయాణికులకు 'ఎయిర్ ఇండియా' క్షమాపణలు చెప్పింది. ప్రయాణికులకు వారి చార్జీలను పూర్తిగా వాపసు ఇస్తామని, అదనంగా తర్వాత ప్రయాణించేందుకు కూపన్‌లు ఇస్తామని ప్రకటించింది. ఈ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తి రష్యాలోని క్రాస్నోయార్స్క్ ఎయిర్‌పోర్టుకు దారి మళ్లించారు. దీంతో ఈ విమానం అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు 30 గంటలు ఆలస్యంగా చేరుకుంది.

టెకీల పని గంటలు పెంపు!

- కర్ణాటక కాంగ్రెస్ సర్కారు యోచన
- ముసాయిదా బిల్లు సిద్ధం
- వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

బెంగళూరు: కర్ణాటకలో ఐటీ రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల పని గంటల్ని 14కు పెంచే దిశగా కాంగ్రెస్ సర్కార్ కీలక బిల్లును సిద్ధం చేసింది. కర్ణాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సవరణ) బిల్లు-2024ను తీసుకురాబోతున్నట్టు ప్రకటించింది. ముసాయిదా బిల్లును రాష్ట్ర సర్కార్ సిద్ధం చేయటం ఐటీ రంగంలో కలకలం రేపింది. ఈ ప్రతిపాదనలపై ఐటీ ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ప్రభుత్వ చర్య అత్యంత అమానవీయమైందిగా ఐటీ ఉద్యోగుల యూనియన్లు నిరసనకు దిగుతున్నాయి. రాష్ట్ర ఐటీ, ఐటీ అనుబంధ ఉద్యోగ సంఘం (కేఐటీయూ) ప్రతినిధులు కర్ణాటక కార్మిక మంత్రి సంతోష్‌ను కలుసుకొని తమ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం ఓవర్‌టైమ్‌తో కలుపుకొని గరిష్టంగా రోజులో 10 పనిగంటలు మాత్రమే పని చేయించేందుకు అనుమతి ఉంది. ప్రైవేట్ ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పిస్తూ సిద్ధరామయ్య సర్కార్ తీసుకొచ్చిన బిల్లుపై ఐటీ రంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ బిల్లుపై ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ ఐటీ ఉద్యోగుల్ని టార్గెట్ చేస్తూ.. మరో బిల్లును తీసుకురావటం చర్చనీయాంశమైంది.

కర్ణాటకలో 'బాయ్‌కాట్ ఫోన్‌పే' ట్రెండింగ్

కర్ణాటకలో స్థానిక కోటా బిల్లుకు వ్యతిరేకంగా విమర్శలు చేసిన డిజిటల్ పేమెంట్ దిగ్గజ సంస్థ 'ఫోన్‌పే' సీఈవో సమీర్ నిగమ్‌పై కన్నడిగులు మండిపడుతున్నారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా ఫోన్‌పేను బహిష్కరించాలని, ఆ యాప్‌ను ఫోన్ల నుంచి అన్‌ఇన్‌స్టాల్ చేయాలంటూ కన్నడ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పిలుపునిస్తున్నారు. #Boycott PhonePe, # Uninstall PhonePe అనే హ్యాష్‌ట్యాగ్‌లను ఎక్స్‌లో ట్రెండింగ్ చేస్తున్నారు. ప్రైవేటు రంగ ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్ల తప్పనిసరి బిల్లు సరికాదని నిగమ్ అభిప్రాయపడ్డారు.

అవివేకం.. రాజ్యాంగ విరుద్ధం!

కర్ణాటక లోకల్ కోటా బిల్లును తప్పుబట్టిన కాంగ్రెస్ ఎంపీ

తిరువనంతపురం: కర్ణాటకలోని సొంత పార్టీ ప్రభుత్వంపై కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ, సీడబ్ల్యూసీ సభ్యుడు శశిథరూర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రైవేటు రంగ సంస్థల ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్లు తప్పనిసరి చేస్తూ తీసుకొచ్చిన బిల్లును సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, అవివేకమైన ఆలోచన అని అభిప్రాయపడ్డారు. శశిథరూర్ శుక్రవారం మాట్లాడుతూ 'ఇది తెలివైన నిర్ణయం కాదు. అలాంటి చట్టాన్ని దేశంలోని ప్రతి రాష్ట్రం తీసుకొస్తే, అది రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా జీవించొచ్చు, పని చేసుకోవచ్చు, ప్రయాణం చేయొచ్చు' అని పేర్కొన్నారు.

తలపాగా, కళ్లజోడు ధరించాడని

దళిత యువకుడిపై దాడి

గుజరాత్‌లో ఘటన

అహ్మదాబాద్: బీజేపీ పాలిత గుజరాత్‌లో దళితులపై దాడులు ఆగడం లేదు. సంప్రదాయ తలపాగా ధరించి కళ్లజోడు పెట్టుకుని దిగిన ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేశాడన్న ఆగ్రహంతో ఒక దళిత యువకుడిని కొందరు అగ్రవర్ణాల వ్యక్తులు చావబాదారు. సబర్‌కాంత జిల్లా సయేబాపూర్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటో రిక్షా నడుపుకుని జీవించే అజయ్ పర్మార్ (24) అనే దళిత యువకుడిని నలుగురు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. 'దర్బార్ సామాజిక వర్గం వారే అలాంటి తలపాగా, కళ్లజోడు ధరించాలి. వాటిని పెట్టుకోవడమే కాక ఫొటో తీసి అప్‌లోడ్ చేయడానికి నీకెంత ధైర్యం' అంటూ తనను చితకబాదారని బాధితుడు వాపోయాడు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేశామని, అయితే నిందితులు పరారీలో ఉన్నారని హిమత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ తెలిపారు.

వీధి వ్యాపారులకు రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు

ఎఫ్ఎస్ఎస్ఏఐకి నడ్డా ఆదేశం

న్యూఢిల్లీ : వీధుల్లో తినుబండారాలను విక్రయించేవారి వద్ద సంవత్సరానికి ఒకసారి వసూలు చేస్తున్న రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100ను రద్దు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా ఎఫ్ఎస్ఎస్ఏఐని ఆదేశించారు. దేశవ్యాప్తంగా స్ట్రీట్ ఫుడ్ హబ్స్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ కోసం నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం సంవత్సరానికి రూ.12 లక్షల వరకు టర్నోవరు కలిగిన చిన్నతరహా ఆహార పదార్థాల వ్యాపారుల వద్ద ఏడాదికి రూ.100 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజును ఎఫ్ఎస్ఎస్ఏఐ వసూలు చేస్తున్నది. ఈ వ్యాపారులకు సర్టిఫికేట్లను, 'స్ట్రీట్ సేఫ్' ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లను ఎఫ్ఎస్ఎస్ఏఐ అందిస్తున్నది.

సెంటర్ల వారీగా నీట్ ఫలితాలు

సుప్రీంకోర్టు ఆదేశాలతో విడుదల చేసిన ఎన్‌టీఏ

హర్యానా కేంద్రంలో పూర్తి భిన్నమైన ఫలితాలు



న్యూఢిల్లీ, జూలై 20: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలవారీగా నీట్-యూజీ ఫలితాలను శనివారం జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) విడుదల చేసింది. మే 5న ఈ పరీక్ష జరగగా జూన్ 5న ఫలితాలు వెలువడ్డాయి. అయితే, ఫలితాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం వివాదంగా మారింది. నీట్‌లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ విచారిస్తున్నది. అయితే, అక్రమాల నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని, మళ్లీ నిర్వహించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటినీ కలిపి విచారిస్తున్న ధర్మాసనం.. నీట్ ఫలితాలను పరీక్ష కేంద్రాలు, నగరాలవారీగా విడుదల చేయాలని ఎన్‌టీఏను గురువారం ఆదేశించింది.

ఆ కేంద్రంలో ఫలితాలు తారుమారు

మొదట విడుదల చేసిన నీట్-యూజీ ఫలితాల్లో హర్యానాలోని బహదుర్‌గఢ్‌లో ఉన్న హర్‌దయాల్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్ష రాసిన విద్యార్థుల్లో ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం తీవ్ర వివాదమైంది. మరో ఇద్దరికి 719, 718 మార్కులు వచ్చాయి. గతంలో దేశమంతా కలిపి ఒకరిద్దరికి మాత్రమే ఇలా పూర్తి మార్కులు వచ్చేవి. ఈసారి ఒకే కేంద్రంలో ఆరుగురికి 100 శాతం మార్కులు రావడం పట్ల అనుమానాలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులు పరీక్ష సమయాన్ని నష్టపోయినందుకు గ్రేస్ మార్కులు కలపడం వల్ల ఇలా అసాధారణ ఫలితాలు వచ్చినట్టు ఎన్‌టీఏ చెప్పింది. తర్వాత గ్రేస్‌మార్కులు రద్దు చేసింది. ఇప్పుడు పరీక్ష కేంద్రాలవారీగా వెల్లడించిన ఫలితాలు ఈ కేంద్రంలో మొదట ప్రకటించిన ఫలితాలకు పూర్తి భిన్నంగా వచ్చాయి. ఈ కేంద్రంలో 494 మంది పరీక్ష రాయగా అత్యధికంగా ఒక విద్యార్థికి 682 మార్కులు మాత్రమే వచ్చాయి. మరో 13 మంది విద్యార్థులకు 600కు పైగా మార్కులు వచ్చాయి.

నికార్ జిల్లాలో సంచలన ఫలితాలు

రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ఈసారి భారీ సంఖ్యలో విద్యార్థులు రికార్డు స్థాయి మార్కులు సాధించారు. జిల్లాలో 6,038 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 149 మంది 700కు పైగా మార్కులు సాధించారు. 2,037 మంది 650కి పైగా మార్కులు, మొత్తంగా 4,297 మంది విద్యార్థులు 600కి పైగా మార్కులు తెచ్చుకున్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సెంటర్‌లో 1,968 మంది పరీక్ష రాయగా ఏకంగా 112 మంది 700కు పైగా మార్కులు సాధించారు.

నీట్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

నీట్-యూజీ అక్రమాల కేసులో శనివారం సీబీఐ మరో ముగ్గురిని అరెస్టు చేసింది. వీరిలో ఒకడైన శశికాంత్ పాశ్వాన్ ఎన్ఐటీ జంషేద్‌పూర్‌లో బీటెక్(ఎలక్ట్రికల్) పూర్తి చేశాడు. పేపర్ లీక్ కేసులో కీలక నిందితులైన పంకజ్ కుమార్, రాకీతో ఇతడికి సంబంధాలు ఉన్నట్టు సీబీఐ గుర్తించింది. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న కుమార్ మంగళం బిష్ణోయ్, దీపేందర్ శర్మను కూడా సీబీఐ అరెస్టు చేసింది. వీరిద్దరు పంకజ్ కుమార్ దొంగలించిన ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాసినట్టు సీబీఐ పేర్కొన్నది. ఈ ముగ్గురి అరెస్టుతో సీబీఐ ఇప్పటివరకు అరెస్టు చేసిన వారి సంఖ్య 21కి చేరుకుంది.

విదేశాంగ కార్యదర్శిని

నియమించిన కేరళ

- విజయన్ సర్కారు అసాధారణ నిర్ణయం
- ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ బీజేపీ ధ్వజం
- కేరళ ను ప్రత్యేక దేశంగా ఏర్పాటుచేయాలని సీఎం ప్రయత్నిస్తున్నారా? అని నిలదీత

కొచి, జూలై 20: కేరళ ప్రభుత్వం తీసుకున్న అసాధారణ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఐఏఎస్ అధికారిని కే వాసుకిని విదేశాంగ కార్యదర్శిగా నియమిస్తూ ఈ నెల 15న పినరయి విజయన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె కార్మిక, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్నారు. విదేశీ సహకారానికి సంబంధించిన అంశాలు సైతం చూసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇందుకు గానూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, ఎంబసీలతో సమన్వయం కోసం న్యూఢిల్లీలోని కేరళ హౌజ్ రెసిడెంట్ కమిషనర్ సహకరిస్తారని ఆదేశాల్లో పేర్కొన్నది. కాగా, ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయమైన బీజేపీ కేరళ అధ్యక్షుడు కే సురేంద్రన్ స్పందిస్తూ.. 'ఈ నిర్ణయం రాజ్యాంగంలోని కేంద్ర అధికారాల జాబితాను ఉల్లంఘించడమే. ఇది తీవ్రమైన అతిక్రమణ. విదేశీ వ్యవహారాలపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదు. ఈ రాజ్యాంగ విరుద్ధ చర్య ప్రమాదకర ఉదాహరణగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. కేరళను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు.

కేరళలో మళ్లీ నిఫా కలకలం!

కేరళలో మళ్లీ నిఫా వైరస్ కలకలం రేపింది. కోజికోడ్‌లో 15 ఏండ్ల బాలుడికి వైరస్ సోకింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలుడు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని చెప్పారు. బాలుడితో సన్నిహితంగా ఉన్నవారిని ఇప్పటికే క్వారంటైన్‌లో ఉంచామని, వారి శాంపిళ్లను పరీక్షలకు పంపినట్టు తెలిపారు.

తాను మరణించినా.. బిడ్డకు జన్మ

మృతురాలి గర్భం నుంచి జన్మించిన శిశువు

గాజా, జూలై 20: ఓ శిశువు తల్లిగర్భంలోనే మృత్యువును జయించాడు. యుద్ధం మిగిల్చిన విషాదంలో చిరంజీవిలా జన్మించాడు. ఇజ్రాయెల్ - గాజా యుద్ధంలో జరిగిన అద్భుతం ఇది. సెంట్రల్ గాజాలోని నుసీరత్ శరణార్థ శిబిరంపై ఇజ్రాయెల్ క్షిపణులతో దాడికి పాల్పడింది. ఈ దాడిలో 24 మంది మరణించగా వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారు. ఈ కుటుంబంలోనే ఒలా అద్నాన్ హర్బ్ అల్ కుర్ద్ అనే గర్భిణి ఈ దాడిలో తీవ్రంగా గాయపడింది. ఆమెను అల్ అవ్దా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. అయితే, ఆమె గర్భంలోని శిశువు గుండెచప్పుడు అల్ట్రాసౌండ్ ద్వారా వైద్యులు గుర్తించారు. దీంతో వైద్యులు వెంటనే అత్యవసర సిజేరియన్ జరిపి మగబిడ్డను బయటకు తీశారు. శిశువు ఆరోగ్యం కూడా మొదట బాగోలేకపోయినా క్రమంగా కోలుకున్నాడు. ఇజ్రాయెల్ దాడిలో శిశువు తండ్రి కూడా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు.

డైనోసార్ అస్థిపంజరం రూ.373 కోట్లు!

వాషింగ్టన్: దాదాపు 15 కోట్ల సంవత్సరాలనాటి డైనోసార్ అస్థిపంజరానికి రూ.373.41 కోట్ల ధర పలికింది. సోథ్‌బైలో జరిగిన వేలంలో దీనిని హెడ్జ్ ఫండ్ సైటాడెల్ వ్యవస్థాపకుడు, సీఈవో కెన్ గ్రిఫిన్ సొంతం చేసుకున్నారు. దీంతో వేలం రికార్డులన్నీ బద్ధలయ్యాయి. దీనిని 2022 మే నెలలో కొలరాడోలో వెలికి తీశారు. దీనికి 'అపెక్స్' అని పేరు పెట్టారు. ఇప్పటి వరకు దొరికిన డైనోసార్లలో ఇదే అతి పెద్దదని సోథ్‌బై తెలిపింది. దీని ఎత్తు 11 అడుగులని, పొడవు 27 అడుగులని వివరించింది. దీనికి 319 ఎముకలు ఉంటాయని అంచనా వేశారని, ప్రస్తుతం 254 ఎముకలు భద్రంగా ఉన్నాయని తెలిపింది.

కెనడా, గ్రీన్‌ల్యాండ్ మధ్య చిన్న ఖండం

న్యూఢిల్లీ, జూలై 20: బయటి ప్రపంచానికి ఇప్పటివరకు తెలియని ఓ చిన్న ఖండం ఒకటి కెనడా, గ్రీన్‌ల్యాండ్ మధ్య ఉందని తాజా అధ్యయనంలో తేలింది. 'డేవిస్ జల సంధి' కిందే ఈ 'సూక్ష్మ ఖండం' ఉందని పరిశోధకులు గుర్తించారు. ఉప్సాసలా యూనివర్సిటీ (స్వ